క్లుప్తంగా

విద్యార్థులకు 'వాసవి' స్కూల్ బ్యాగుల పంపిణీ



మచిలీపట్నంటౌన్: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. నగరంలో జరిగిన క్లబ్ రీజియన్ మీట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు యెండూరి సురేష్, శ్రీకాకోళపు రేణుకారాణి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశామన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా క్లబ్‌ను మరింత పటిష్టం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు.

డీసీఎంఎస్ డైరెక్టర్ బెనర్జీ రాజీనామా




నాగాయలంక: మండలంలోని రేమాలవారి పాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత రేమాల సుబ్బారావు(బెనర్జి) కృష్ణా జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఓటమి చెందిన నేపథ్యంలో నైతిక బాధ్యతగా డీసీఎంఎస్ డైరెక్టర్ పదవి నుంచి తప్పుకుంటూ సొసైటీ జిల్లా మేనేజర్‌కు రాజీనామా లేఖను సమర్పించినట్లు పేర్కొన్నారు. తమ పార్టీ పరాజయం చెందడాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని, అనుమానాలు కలిగించే రీతిలో కూటమి అభ్యర్థులు గెలుపొందడం అంతుపట్టని విధంగా ఉందని తెలిపారు.

ప్రశాంతంగా లాసెట్ ప్రవేశ పరీక్ష



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన లాసెట్–2024 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్ఎన్ రెడ్డి, సెంటర్ అడ్మిన్ అశోక్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన పరీక్షకు 192 మందికిగాను 166 మంది హాజరయ్యారని, 26 మంది ఆబ్సెంట్ అయ్యారని పేర్కొన్నారు. ఎటువంటి మాల్‌ప్రాక్టిస్ కేసులు నమోదు కాలేదని, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష పూర్తైందని వారు తెలిపారు.

గడ్డివామి దగ్ధం



గూడూరు: మండల పరిధిలోని ఆకులమన్నాడ గ్రామంలో గడ్డివామి దగ్ధమైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు మహ్మద్ ఇనాయతుల్లా తన 22 ఎకరాల పంటకు చెందిన వరి గడ్డిని వామిగా వేసుకున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన స్థానికులు మంటలార్పే ప్రయత్నం చేశారు. అయినా మంటలు అదుపులోకి రాకపోవడంతో మచిలీపట్నం అగ్నిమాపక దళ కేంద్రానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. దాదాపు రెండు లక్షల రూపాయలు నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

అభయాంజనేయస్వామి దీవెనలు ఉండాలి



గుడివాడరూరల్: అభయాంజనేయస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక నీలామహల్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి ముగిసిన సందర్భంగా బీఎస్ఎన్ఎల్ సుబ్రహ్మణ్యం–వెంకటరమణ దంపతుల వితరణతో కమిటీ సభ్యులు సుంకర నాగార్జున, రత్నగిరి, పూజారి నండూరి రాంబాబుల ఆధ్వర్యంలో ఆదివారం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని యలవర్తి ప్రారంభించారు. తొలుత స్వామికి యలవర్తి విశేష పూజలు నిర్వహించారు.

ఘనంగా పోతరాజుస్వామి జాతర







రేమాలవారిపాలెం శివారు పేర్లవానిలంకలో కొలువైన పోతురాజు స్వామి దేవస్థానంలో ఆదివారం వార్షిక జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ ధర్మకర్త పేర్ల శివరామప్రసాద్ పర్యవేక్షణలో డప్పు నృత్యాలు, మేళతాళాలతో నాగాయలంక కృష్ణానదిలో పుణ్యస్నానాలకు తరలివెళ్లారు. పోతురాజు శిలలతో నదిలో పవిత్ర స్నానాలు, జాతర సంప్రదాయ ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఊరేగింపుగా గ్రామానికి చేరుకుని జల్దిలో ఉంచిన తర్వాత శిలలను ఆలయం ప్రతిష్ఠించి పాల పొంగళ్లు, చద్ది నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. పెద్దలు పేర్ల భీమేశ్వరరావు, శ్రీహరి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– రేమాలవారిపాలెం(నాగాయలంక)

పేదలకు సాయం చేయడమే బక్రీద్



ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నాగుల్‌మీరా, తదితరులు

నున్న(విజయవాడరూరల్): పేదలకు సహాయం చేయడమే బక్రీద్ పండుగ ముఖ్యఉద్దేశమని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఆజాద్ ముస్లిం కమిటీ ఏపీ 31వ నెల సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం బక్రీద్ పండుగను పురస్కరించుకొని నున్న టీచర్ కాలనీ మక్కామసీద్ వద్ద పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ ఆర్థికపరమైన సంతోషాలతో ఉన్న కుటుంబాలు బక్రీద్ సందర్భంగా ఖుర్బానీ ఇవ్వాల్సిన బాధ్యత ఉందని, అదే పేదలకు సాయం చేయడమనన్నారు. మనతో పాటు పేద కుటుంబాలను సహాయం చేసి ఆదుకోవడమే ఆజాద్ ముస్లిం కమిటీ విధానమన్నారు. ప్రతి నెలా ఒక్కొక్క నియోజకవర్గంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్నవారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్, గన్నవరం నియోజకవర్గం ఉపాధ్యక్షుడు మస్తాన్ వలీ, రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్దుల్ రహీం, నున్న గ్రామ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ఉపాధ్యక్షుడు ఎండీ గౌస్, కార్యదర్శి సుభాని, సెంట్రల్ నియోజకవర్గం కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి



జమీదగ్గుమిల్లిలో విరాళాలు సేకరిస్తున్న చంద్రశేఖరరావు, గ్రామస్తులు

జమీదగ్గుమిల్లి(పామర్రు): గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గంగానమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి దాతలు మరింగా సహకరించాలని సర్పంచ్ కూనపరెడ్డి చంద్రశేఖరరావు, గ్రామస్తులు పేర్కొన్నారు. మండలంలోని జమీదగ్గుమిల్లిలో ఏర్పాటు చేసే గంగానమ్మ ఆలయంలో గంగానమ్మ విగ్రహం కొనుగోలుకు గ్రామస్తులు భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ఇంటింటికీ తిరిగి విరాళాలను ఆదివారం సేకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆలయాన్ని సుమారు రూ.35 లక్షలతో నిర్మాణం పనులు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామస్తుల నుంచి వచ్చిన విరాళాలతోనే అమ్మవారి విగ్రహం కొనుగోలు చేసి ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు, గంగానమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులుపాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న సబ్‌జైల్ అధికారి విజయ్‌దేని, సాంబశివరావు

చల్లపల్లి(అవనిగడ్డ): విద్యతో ఉన్న శిఖరాలు అందుకోవచ్చని వరంగల్ జిల్లా సబ్ జైళ్ల అధికారి జి.విజయ్ డేని అన్నారు. ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యాన చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పలు మండలాలకు చెందిన 46 మంది పదో తరగతి మెరిట్ విద్యార్థులకు రూ.80,500 విలువైన నగదు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా విజయ్‌డేని మాట్లాడుతూ ప్రతిభా వంతులైన పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని చెప్పారు. ఏ పనైనా ఆత్మవిశ్వాసంతో చేయాలని అప్పుడే విజయం వరిస్తుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత మిలటరీ సుబేదార్ మద్దిపట్ల శ్రీనివాసరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు, అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజు అశ్విన్‌కుమార్, కార్యదర్శి బీడీఆర్ ప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధులు లంకె సుభాషిణి, విస్సంశెట్టి చారుమతి, అద్దేపల్లి సాయికుమారి, మోర్ల శివ, అడ్డాడ ప్రసాద్, నడకుదురు లీలా బ్రహ్మేంద్ర, జిలానితో పాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రామాలయం 'ప్రథమ' ప్రతిష్ఠా మహోత్సవాలు

మచిలీపట్నంటౌన్: నిజాంపేటలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయం ప్రథమ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం ఈ నెల 11వ తేదీ మంగళవారం నుంచి 13వ తేదీ గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ భక్త బృందం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆలయంలో 11వ తేదీ మంగళవారం అష్టోత్తర కలశ స్నపన (అభిషేకం), సాయంత్రం లక్ష మల్లికా కుసుమార్చన, 12వ తేదీన లక్ష తులసీ దళార్చన, సాయంత్రం శ్రీ సీతారాముల శాంతి కల్యాణ మహోత్సవం, 13వ తేదీ మూల మంత్రానుష్ఠాన హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం కూచిపూడి నాట్య ప్రదర్శన పాహి రామ ప్రభో సంగీత రూపకల్పం వంటి సాంస్కృతిక జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ ఆదివారం ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

కొండలమ్మకు మొక్కుల సమర్పణ

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా రాజశ్యామల యాగం

ముదినేపల్లి రూరల్: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ముదినేపల్లిలో ఆదివారం రాజశ్యామల యాగాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రముఖ వైద్యుడు అంబుల మనోజ్, కుమార్తె, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి ఈ యాగాన్ని నిర్వహించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలంతా సుభిక్షంగా ఉండాలనే ధ్యేయంతో ఈ యాగాన్ని నిర్వహించినట్లు చెప్పారు.

తిరుపతమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే కాగిత



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారిని ఆదివారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించి మొక్కులు తీర్చుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు ఆయనను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్ సురేష్ గురు పట్టాభిషేకం

200 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకల పంపిణీ



ఫాదర్ సురేష్ మెర్లోని ఘనంగా సత్కరిస్తున్న ఫాదర్స్, జనరల్, అసిస్టెంట్ జనరల్ సిస్టర్స్

అవనిగడ్డ: స్థానిక కోటగిరిలంకలోని ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు జి.సురేష్ మెర్లో గురు పట్టాభి మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఫాదర్ సురేష్ మెర్లో ఫాదర్ అయ్యి 20 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా స్థానిక చర్చి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేసి విశ్వాసులకు అందించారు. అనంతరం ఫాదర్ లూయిస్ రాజు, ఫాదర్ జాన్ .. ఫాదర్ సురేష్‌ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫాదర్స్ ప్రత్యేక ప్రార్థనలు చేసి విశ్వాసులకు దివ్యసత్ప్రసాదాన్ని అందించారు. తొలుత 1918, 1931లో కోటగిరిలంక ఆర్‌సీఎం చర్చిలో పనిచేసి ఇక్కడే మరణించిన యువ ఫాదర్ పి తింథోరియా, ఫాదర్ పి ఫాంథాన, సిస్టర్స్ సి గోరంట్ల మరియ, సి కోపుల్ల థెరిస్సా, జి.సుజానమ్మ చిత్రపటాలకు ఫాదర్స్, జనరల్, అసిస్టెంట్ జనరల్, సుపీరియస్ సిస్టర్స్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 200 మంది పేద విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం కోటగిరిలంకలో నిర్మించిన ముగ్గురు సిస్టర్స్ సమాధులను సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోటగిరిలంక, సీతాయిలంక సంఘ పెద్దలు, మరియదళ సభ్యులు పలు గ్రామాల నుంచి విచ్చేసిన సంఘస్థులు పాల్గొన్నారు.

'ఎన్‌ఎంఎంఎస్'లో మండల విద్యార్థి జిల్లా ఫస్టు



పువ్వాడ నాగశ్రీ



సుశీల

కృత్తివెన్ను: జాతీయ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) కోసం నిర్వహించిన పరీక్షల్లో మండలంలోని చినగొల్ల పాలెం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పువ్వాడ నాగశ్రీ జిల్లా మొదటి ర్యాంకు సాధించినట్లు ఎంఈవో ఎస్‌కేడీ ప్రసాద్ తెలిపారు. మండలంలో చినగొల్ల పాలెం పాఠశాల నుంచి పువ్వాడ నాగశ్రీ, కొక్కిలిగడ్డ సుజాత, బొమ్మిడి మేఘన, బొల్లం రామ సత్యజ్యోతి, బోళ్ల గణేష్‌నాగహర్ష, కృత్తివెన్నుపల్లె పాలెం నుంచి ఎస్. భార్గవి, లక్ష్మీపురం నుంచి తిరుమాని రాజు, కొమాళ్లపూడి నుండి జి. గిరి, చిన పాండ్రాక నుంచి ఎండీ యాసిమ్‌లు స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. చినగొల్లపాలెం పాఠశాల నుంచి ఏకంగా ఐదుగురు విద్యార్థులు ఎంపిక కావడంపై పాఠశాల ఉపాధ్యాయులను ఎంఈవోలు త్రిపురసుందరి, ప్రసాద్‌లతో పాటు స్థానిక పెద్దలు అభినందించారు.

శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని సుశీల ఎంపిక

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని జి.సుశీల నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ సుశీలకు 2024–25 విద్యా సంవత్సరం 9వ తరగతి నుంచి వరుసగా నాలుగు సంవత్సరాల పాటు అనగా ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తుందన్నారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన సుశీలను హెచ్‌ఎం, సిబ్బంది, ఎస్ఎంసీ చైర్మన్ తోడేటి సుధీర్, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ధర్మారావు

గన్నవరం: విద్యార్థి దశ నుంచి ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవార్చుకోవాలని విశ్రాంత హిందీ పండిట్ కంభంపాటి ధర్మారావు సూచించారు. స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా హాజరైన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ..గ్రంథాలయాల్లోని అమూల్యమైన పుస్తక సంపదను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కనీసం వారంలో ఒక రోజైన గ్రంథాలయాలను సందర్శించాలని విద్యార్థులకు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన గ్రంథాలయ సిబ్బందిని ఆయన అభినందించారు. ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి డి.బాబూరావు, పలువురు సిబ్బంది పి. దుర్గలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పెదపులిపాక ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో విజయరాజ రాజేశ్వరి, శ్రీవిజయ సుందరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి తొలుత అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. కాకినాడ నుంచి వచ్చిన సత్కలవాహిని బృందం సభ్యులు ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. అనంతరం స్వామీజీ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు అందజేశారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉదయానికే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి పుట్టలో పాలు పోయడం మొదలు పాలపొంగళ్లశాల వద్ద నైవేద్యాలు తయారు చేసేందుకు సైతం భక్తులు పోటీ పడ్డారు. పలువురు మహిళా భక్తులు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. స్వామిని దర్శించుకునేందుకు అధిక సమయం క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది. నాగబంధాల వద్ద గోశాల వద్ద మహిళలు భారీ ఎత్తున పూజలు చేశారు. నిత్యాన్నదాన ప్రసాదానికి భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఇందుకనుగుణంగా సహాయ కమిషనర్ నేల సంధ్య చొరవతో ఆలయ కళామండపంలో భక్తులకు అన్న సమారాధన ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు ప్రసాదపు కౌంటర్లను ఏర్పాటు చేశారు. వారం వారం పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఏసీ సంధ్య తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మండవల్లి హైస్కూల్లో 1989-90 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

మండవల్లి: మండవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 34 సంవత్సరాల తర్వాత ఒక చోట చేరిన విద్యార్థులు ఒకరికొకరు స్వాగతం చెప్పుకుంటూ ఆనందోత్సాహాలతో పలకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. అందరి చిరునామాలు సేకరించి అందరూ ఒకచోట కలుసుకోవడానికి కృషి చేసిన గోల్కొండ గోపి, బండి నాగేశ్వరరావు, ఎర్రబోతు శ్రీనివాసరావు, కాండ్రు చెల్లమ్మ, గుడివాడ రాజేశ్వరిని సత్కరించి, అభినందించారు. ఆనాటి గురువులు డ్రాయింగ్ టీచర్ ఎల్ఎస్ భాస్కరరావు, హిందీ టీచర్ జానకిరామయ్య, తెలుగు టీచర్ ఏకే లక్ష్మి, లేట్ అసిస్టెంట్ అట్లూరి వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాము స్థిరపడేందుకు కారకులైన ఉపాధ్యాయులకు కృతజ్ఞతాభినందనలు తెలిపారు.

వరి విత్తనాలు సిద్ధం

పెనమలూరు: మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. మండల పరిధిలో దాదాపు ఆరున్నర వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తారు. ఇక్కడ వరి పండించే పొలాలకు అనుగుణంగా ఎంటీయూ 1318, ఎంటీయూ 1061 రకం వరి విత్తనాలు రైతుభరోసా కేంద్రాలకు వచ్చాయి. క్వింటా వరి విత్తనాలకు రూ.500 సబ్సిడీ ఉంది. కేజీ వరి విత్తనాలు సబ్సిడీ పోను రూ.34.80 వంతున రైతులకు ఇస్తారు. మండలానికి వరి విత్తనాలు 140 క్వింటా కావాల్సి ఉండగా ప్రస్తుతం 1318 రకం 60 క్వింటాళ్లు, 1061 రకం వరి విత్తనం 70 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ తెలిపారు. రైతులకు మరిన్ని వరి విత్తనాలు అవసరమైతే తెప్పించి రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులు సకాలంలో వరి విత్తనాలు తీసుకొని సాగుకు సమాయత్తం కావాలని కోరారు.

కళారంగానికి పుట్టినిల్లు

గుడివాడరూరల్: కళారంగానికి పుట్టినిల్లు గుడివాడ అని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక నీలామహల్‌రోడ్డులోని కళాకారుల సంఘ కార్యాలయంలో పేద కళాకారులకు ఆదివారం ఆయన పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులకు, నాట రంగానికి పేరుగడించిన ఘనత గుడివాడకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నెరుసు చింతయ్య, పలువురు మాజీ కౌన్సిలర్లు, కళాకారులు పాల్గొన్నారు.

ఘనంగా రెడ్డంకమ్మ జాతర



అవనిగడ్డ: స్థానిక తొమ్మిదో వార్డులోని కొత్త ఎడ్లంకలో వేంచేసియున్న రెడ్డంకమ్మ జాతర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్షగాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. బట్టువారి కులదైవంగా కొలుస్తున్న అమ్మవారికి అర్చకులు బట్టు నరసింహారావు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జన్మ నక్షత్రం పురస్కరించుకుని ఈనెల 5వ తేదీ నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా, ఆదివారం జరిగిన జాతర మహోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి పూజలు చేశారు.